క్లుప్తంగా

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న అభయం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవను కనుల పండువగా చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

టీపీఎం స్కూల్‌కు వంటసామగ్రి వితరణ



టీపీపీఎం స్కూల్‌కు వంట సామాగ్రి వితరణ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ ఆధ్వర్యంలో శనివారం టీపీ ఏరియాలోని టీపీపీఎం స్కూల్‌కు సుమారు రూ.40 వేలు విలువ చేసే వంట సామగ్రిని వితరణ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, జగన్నాథం మాట్లాడుతూ తిరుపతి టీపీపీఎం స్కూల్‌కు గొప్ప చరిత్ర ఉందని, దానికి సేవ చేసే అవకాశం రావడం అదృష్టమని తెలిపారు. హెచ్‌ఎం ఆనందకుమార్ మాట్లాడుతూ తాము సాయం అడిగిన వెంటనే లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ వంట సామగ్రి ఇవ్వడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు బి.రఘు, రామారావు, లక్ష్మీ పాల్గొన్నారు.

కారు బోల్తాపడి ముగ్గురికి గాయాలు

చంద్రగిరి: పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలోని గడ్డకింద పల్లి సమీపంలో ప్రమాదవశాత్తు శనివారం కారు బోల్తా పడి ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. తిరుపతి జీవకోనకు చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలారి రాజేంద్ర తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల అంత్యక్రియలకు కారులో ఐరాలకు బయలుదేరారు. గడ్డకిందపల్లి వద్ద కారు ముందు టైరు పేలడంతో బోల్తా పడింది. రాజేంద్ర క్షేమంగా బయటపడగా శాంతమ్మ, గోపి, మణికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 సిబ్బంది తిరుపతి రుయాకు తరలించారు.

అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శనివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి మానవేంద్రనాథ్ రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏవీఎస్వో శైలేంద్రబాబు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. ఆలయ వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : పుట్టగొడుగుల్లో పోషక విలువలు పుష్కలంగా ఉన్నాయని మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ రజని తెలిపారు. వర్సిటీలోని బయో సైన్సెస్, సెరికల్చర్ విభాగం ఆధ్వర్యంలో 3 నెలల పుట్టగొడుగుల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. కన్వీనర్ ప్రొఫెసర్ జి.సావిత్రి మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిరక్షణ పద్ధతులు, ఆన్‌లైన్ మార్కెటింగ్ తదితరాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ పి.సుజాతమ్మ, ఎల్‌బీపీ కోఆర్డినేటర్ బి.జీవనజ్యోతి, బయో సైన్సెస్, సెరికల్చర్ విభాగాధిపతి డీఎం.మమత, అధ్యాపకులు ఎన్.విజయకుమారి, ఎ.సువర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిశీలించండి

తిరుపతి అర్బన్: అసైన్‌మెంట్, చుక్కల భూములకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం జేసీ డీకే బాలాజీ, డీఆర్వో శ్రీనివాసరావుతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వరం పరిశీలించి పరిష్కారం చూపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. జిల్లాలో 36 ఎస్సీ కాలనీలకు శ్మశానవాటికల అవసరాన్ని గుర్తించామని చెప్పారు. 22 చోట్ల మాత్రమే భూసేకరణ చేశారని, మిగిలిన చోట్ల 90 రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు.

సంగీతంతో మానసిక ప్రశాంతత

తిరుపతి కల్చరల్: సంగీతంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వయోలిన్ విద్యాంసురాలు చల్లా ప్రభావతి తెలిపారు. ద్వారం లక్ష్మీ అకాడమీ ఫర్ మ్యూజికల్ సర్వీసెస్, భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సంస్కృత వర్సిటీ సంయుక్తంగా మూడు రోజుల వాగ్గేయకార వైభవోత్సవాలు శనివారం జాతీయ సంస్కృత వర్సిటీ ఆవరణలో ఘనంగా ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు డాక్టర్ ద్వారం లక్ష్మి, నేమాన వెంకటరమణ శర్మ, దుబాయ్ రంగకృష్ణస్వామి, అనిపిండి నాగపద్మ, ధనశ్రీ పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో చిరుత

తిరుమల : మొదటి ఘాట్ రోడ్డులో శనివారం సాయంత్రం వాహన చోదకులకు చిరుత కనిపించింది. కొండ వాగులోని నీటి గుంత వద్ద చిరుత నీరుతాగుతూ ఉండడాన్ని కొందరు గుర్తించారు. దీనిపై తితిదే నిఘా విభాగానికి భక్తులు సమాచారాన్ని అందించారు.

రూ.395 కోట్ల వార్షిక బడ్జెట్‌కు ఆమోదం



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి

- మేయర్ శిరీష
- తిరుపతి ప్రజాభివృద్ధికి పెద్దపీట
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.395 కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఎస్వీ సెనేట్ హాల్‌లో శనివారం మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మేయర్ శిరీష అధ్యక్షత వహించగా కౌన్సిల్‌కు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రత్యేక ఆహ్వానితుల హోదాలో హాజరయ్యారు. కమిషనర్ అనుపమఅంజలి బడ్జెట్ తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణ, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు బడ్జెట్‌పై చర్చించి ఏకగ్రీవ ఆమోదాన్ని తెలిపారు. ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ తిరుపతి నగర అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కౌన్సిల్ బడ్జెట్‌కు ఆమోదం తెలపడం సంతోషంగా వుందన్నారు. నగర భవిష్యత్‌ను దృష్టిలో వుంచుకుని కౌన్సిల్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజాఆమోదం పొందుతున్నాయన్నారు. ఆదాయ వనరుల పెంపుపై దృష్టిసారించడం శుభపరిణామమన్నారు. మేయర్ శిరీష మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రూ.395 కోట్లకు ఏకగ్రీవ ఆమోదం లభించిందన్నారు. ఇందులో రెవెన్యూ రాబడి రూ.150.27 కోట్లు, మూలధన రాబడి రూ.238.98 కోట్లు, ప్రస్తుత ప్రారంభ నిల్వ రూ.6.55 కోట్ల అంచనా వేసినట్టు తెలిపారు. శెట్టిపల్లి పంచాయతీ మున్సిపల్ కార్పొరేషన్‌లోకి విలీనం చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డికి కౌన్సిల్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కే బాబు మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఖాళీగా వున్న స్థలాలకు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ విధించాలని ప్రతిపాదించారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు వీఎల్‌టీపై చర్చించారు. దీనిపై కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ ఖాళీగా వున్న స్థలాలను గుర్తించి వాటికి పన్నులు విధిస్తామన్నారు. వీఎల్‌టీ కట్టని స్థలాల రిజిస్ట్రేషన్లు చేయవద్దని కోరుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి లేఖలు రాస్తామని వెల్లడించారు. 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగరంలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఇంటి నిర్మాణ దరఖాస్తులకు డెవలప్‌మెంట్ చార్జీలు 14 శాతాన్ని వసూలు చేస్తే కార్పొరేషన్‌కు ఆదాయం పెరుగుతుందన్నారు. దీనిపై తగిన ఆదేశాలు జారీ చేస్తామని కమిషనర్ వివరణ ఇచ్చారు. కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులతో పాటు అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళేశ్వరరెడ్డి, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, సెక్రటరీ రాధిక, రెవెన్యూ ఆఫీసర్ కెఎల్ వర్మ పాల్గొన్నారు.

రాష్ట్ర పండుగగా తిరుపతి గంగజాతర

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వెల్లడి



కుంకుమ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, ఆలయ చైర్మన్, ఈవో

తిరుపతి కల్చరల్: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా అధికారికంగా గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసు కుంటోందని, వారంలో అధికారికంగా ప్రకటన రానుందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన శనివారం మేయర్ శిరీషతో కలిసి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే గంగమ్మ జాతరకు అత్యంత ప్రాచీన చరిత్ర ఉందని తెలిపారు. అమ్మవారి ఆలయ పునః నిర్మాణ పనుల్లో భాగంగా తవ్వకాల్లో దొరికిన రాతి స్తంభాలు ఆఖరు పల్లవుల కాలం నాటివని తెలిసిందని, చోళులు, విజనగర కాలం నాటి గుర్తులు కూడా లభించాయన్నారు. ఇంతటి విశిష్టత కలిగిన అమ్మ వారి ఆలయాన్ని దేవదాయ, టీటీడీ ద్వారా రూ.16 కోట్లతో అద్భుతంగా నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో తిరుపతి గంగమ్మ వైభవాన్ని, విశిష్టతను విస్తృతం చేయాలని విజ్ఞులు సంకల్పించారన్నారు.

గంగమ్మ కుంకుమ పంపిణీ

తిరుపతి గంగమ్మ జాతర నేపథ్యంలో నగరంలోని ప్రతి ఇంటికీ లక్ష కుంకుమార్చన కుంకుమను పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే భూమన తెలిపారు. ఆయన కుంకుమ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, వైఎస్సార్ సీపీ తిరుపతి నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, ఎన్‌వీ.సురేష్‌రాయల్, వేశాలమ్మ ఆలయ చైర్మన్ విజయ్‌కుమార్, సీఆర్‌కే.శేషగిరి రావు, ఉదయ్ వంశీ పాల్గొన్నారు.

గంగ జాతరకు రూ.50 లక్షల టీటీడీ నిధులు

తిరుపతి అలిపిరి: తాతయ్యగుంట గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించేందుకు తిరుమల శ్రీవారు అన్నగా రూ.50 లక్షలు మంజూరు చేశాడు. ఈ నిధులతో తిరుపతిలోని వీధుల్లో డెకరేషన్, విద్యుత్ అలంకరణలు, మైక్ సెట్టింగ్స్, ఆలయంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పూల అలంకరణ చేపట్టాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి గంగమ్మ జాతర నిర్వాహణలో టీటీడీ భాగస్వామి కావాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఈ ఏడాది జనవరిలో కోరారు. ఈ మేరకు గంగమ్మ జాతర ఏర్పాట్లకు రూ.50 లక్షలు మంజూరు చేస్తూ ఫిబ్రవరిలో టీటీడీ పాలక మండలి ఆమోదముద్ర వేసింది. రూ.50 లక్షలు నిధులు విడుదల చేయడంలో చొరవ చూపిన ఎమ్మెల్యే కరుణాకరరెడ్డికి, విడుదల చేసిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డికి గంగమ్మ ఆలయ పాలక మండలి కృతజ్ఞతలు తెలిపింది.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం



గడప గడప కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం తిరుపతి 3వ డివిజన్‌లో కార్పొరేటర్ తమ్ముడు గణేష్, డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్‌తో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న అధికారంలోకి వచ్చిన మూడేళ్లల్లో చేసిన ప్రగతి, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 95 శాతం మందికి సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. అందువల్లే తాము ఏ గడపకు వెళ్లినా విశేష ఆదరణ లభిస్తోందన్నారు. కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, డైరెక్టర్ కడపగుంట అమరనాథ్ రెడ్డి, నాయకులు మల్లం రవిచంద్రారెడ్డి, మునిరెడ్డి, కుమార్, పాండు, రాజేష్, యమునమ్మ, శేఖర్‌రెడ్డి, ధనశేఖర్, నాదముని పాల్గొన్నారు.

సిటీ ఆపరేషన్ సెంటర్ పనుల పరిశీలన

తిరుపతి తుడా: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం స్థలంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ భవన నిర్మాణ పనులను మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి శనివారం పరిశీలించారు. మేయర్ శిరీష మాట్లాడుతూ స్మార్ట్ సిటీ పథకం కింద రూ.81 కోట్లతో సిటీ ఆపరేషన్ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఇండోర్ స్టేడియం, ఆర్ట్ స్టూడియోలను పరిశీలించి త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈ మోహన్‌ను ఆదేశించారు. స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఎంఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గజవాహనంపై శ్రీరామతేజం

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం హనుమంత వాహనంపై శ్రీరామచంద్రమూర్తి ఊరేగుతూ భక్తులకు అనుగ్రహించారు. ఉదయం 11 నుంచి 12 వరకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేశారు. రాత్రి 7 నుంచి 9.30 గంటల వరకు స్వామి వారి గజవాహన సేవ అత్యంత వైభవంగా సాగింది. పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్నం, ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ రమేష్, కంకణభట్టర్ ఆనందకుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన న్యాయవాదులు



తిరుపతి లీగల్: తిరుపతి సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ప్రభుత్వం తరపున కేసులు వాదించడానికి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన ఎస్‌జీ వెంకటరామయ్యతో పాటు పలువురు న్యాయవాదులు శనివారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని కలిశారు. ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తరపున పేద ప్రజలకు సత్వర న్యాయం అందేలా కోర్టుల్లో వాదించాలని ఏజీపీ వెంకటరామయ్యకు సూచించారు. పేద ప్రజలకు న్యాయం అందించాలన్నదే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కోరికని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు దొరబాబు, ఉపాధ్యక్షుడు మోహన్‌కుమార్‌రెడ్డి, తిరుపతి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు విజయకుమార్, న్యాయవాదులు శశాంక్, ఈశ్వరయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న 34వ డివిజన్ నాయకులు, స్థానిక మహిళలు

తిరుపతి మంగళం : ఎన్నికల్లో ఇచ్చిన హామీల కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలను అందించి 'మాట తప్పని.. మడం తిప్పని' నాయకుడిగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో నిలిచి పోయారని కార్పొరేటర్ శ్రావణి, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు మార్కెట్ మునిరామిరెడ్డి కొనియాడారు. మూడో విడత వైఎస్సార్ ఆసరా అందజేసిన సందర్భంగా శనివారం తిరుపతి 34వ డివిజన్‌లో మహిళలతో కలిసి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకే ఓటు వేసి తిరిగి గెలిపించుకుంటామని చెప్పారు. ఈ వార్డు అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి, రాఘవులునాయుడు, ధనుంజయులు పాల్గొన్నారు.

తుంబురుతీర్థ ముక్కోటికి విస్తృత ఏర్పాట్లు

తిరుమల: ఏప్రిల్ 5, 6 తేదీల్లో నిర్వహించనున్న తుంబురు తీర్థ ముక్కోటికి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం తిరుమల అన్నమయ్య భవనంలో అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ తుంబురు తీర్థానికి ఏప్రిల్ 5న ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 6వ తేదీన ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు భక్తులను అనుమతిస్తామన్నారు. పాపవినాశనం డ్యామ్ వద్ద భక్తులకు అన్నప్రసాదాలు అందించాలని, ప్రథమ చికిత్సా కేంద్రాలు, అంబులెన్స్‌ను ఏర్పాటుచేయాలని సూచించారు. పోలీసు, అటవీ, టీటీడీ విజిలెన్స్ విభాగాలు సమన్వయంతో భద్రతా చర్యలు చేపట్టాలన్నారు.

తండ్రి ఆలోచన.. తనయుడి ఆచరణ



మాట్లాడుతున్న బీవీ పాల్ రాజు

చంద్రగిరి: దళిత క్రైస్తవులను ఎస్సీలుగా పరిగణించాలన్న దివంగత వైఎస్సార్ ఆలోచనను ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణలోకి తీసుకొచ్చారని జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బీవీ పాల్ రాజు తెలిపారు. ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమన్నారు. ఆయన శనివారం చంద్రగిరిలో క్రిస్టియన్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ అంశంపై చట్టసభల్లో తీర్మానం చేశారని గుర్తుచేశారు. ఆయన అకాల మరణం తర్వాత ఆ అంశం అటకెక్కిందన్నారు. నేడు సీఎం వైఎస్ జగన్ దళిత క్రైస్తవులకు అండగా నిలుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం శుభపరిణామమన్నారు. సామాజికంగా, ఆర్థికంగా దళిత క్రైస్తవులు అభివృద్ధి చెందాలని సీఎం సంకల్పించారన్నారు. బీసీ, దళిత వర్గాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని మరోసారి నిరూపితమైందని పేర్కొన్నారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చిరుధాన్య వంటకాలు శ్రేయస్కరం



బహుమతి అందిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఆదిమూలం, రామ్‌కుమార్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : చిరుధాన్య వంటకాలు ఆరోగ్యానికి శ్రేయస్కరమని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి కలెక్టరేట్‌లో చిరుధాన్యాల వంటకాల ప్రదర్శనను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. రుచికరంగా వంటకాలు తయారుచేసిన ఐదుగురికి బహుమతులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ఈ ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. ఈ క్రమంలో తిరుపతితోపాటు 33 మండల కేంద్రాల్లో చిరుధాన్య వంటకాల స్టాల్స్ ఏర్పాటు చేయించాలని డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ చిరుధాన్య వంటకాలను భుజిస్తే ఆరోగ్యానికి ఎంతో మేలని తెలిపారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుకు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభావతి పాల్గొన్నారు.

సన్మానం



తాడేపల్లెలో శనివారం వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అనుబంధ విభాగాల రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. పార్టీ అనుబంధ సంఘాల రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గ్రీవెన్స్ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షు డు అంకిరెడ్డి నారాయణమూర్తిని పార్టీ తిరుపతి జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఉదయగిరి రమేష్ సన్మానించారు. – తిరుపతి మంగళం

రాష్ట్రస్థాయి క్రికెట్ విజేత ఎస్వీ మెడికల్ కళాశాల



ట్రోఫీతో ఎస్వీ మెడికల్ కళాశాల విద్యార్థులు

తిరుపతి తుడా : డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో నాలుగు రోజులపాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో వైజాగ్ ఆంధ్ర వైద్య కళాశాల జట్టుతో తలపడ్డ ఎస్వీ మెడికల్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో 35 జట్లు క్రికెట్ పాల్గొన్నాయి. గెలుపొందిన ఎస్వీ మెడికల్ కళాశాల, ఆంధ్ర వైద్య కళాశాల జట్లకు కప్‌లు అందజేశారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వసుంధరాదేవి, వైఎస్సార్ హెల్త్ వర్సిటీ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ త్రిమూర్తి పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి



బాలింతకు బేబీ కిట్టు అందజేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి

ఎర్రావారిపాళెం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి ఆదేశించారు. ఆయన శనివారం నెరబైలు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఎర్రావారిపాళెం మండలం చింతగుంటలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీలోని రికార్డులు తనిఖీ చేశారు. డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్టు తమ దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

భాకరాపేట: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని తిరుపతి జిల్లా వైద్యాధికారి శ్రీహరి పేర్కొన్నారు. ఆయన శనివారం భాకరాపేట పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రోగుల నమోదు రిజిస్టర్, గర్భవతులు, బాలింతల వివరాలు, విలేజ్ క్లినిక్ పనితీరుపై ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొంది డిశ్చార్జి అయిన రోగులకు అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యాధికారి శశికళ పాల్గొన్నారు

భూమిని కాపాడుకుందాం

తిరుపతి కల్చరల్: కాంతి కాలుష్యం నుంచి భూమిని కాపాడుకోవాలని విశ్వ విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథ్‌రెడ్డి, జిల్లా ఎన్‌జీసీ సమన్వయకర్త హరిశంకర్ పిలుపునిచ్చారు. కాంతి కాలుష్యం నుంచి భూమిని కాపాడుకోవాలని కోరుతూ శనివారం రాత్రి వరదరాజనగర్ సర్కిల్ నుంచి అన్నారావు సర్కిల్ వరకు విద్యార్థులతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎస్వీ క్యాంపస్ స్కూల్ కేవీ.రాజు, ఎన్‌జీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ నీలకంఠ, క్లస్టర్ కో ఆర్డినేటర్లు కల్పన, సత్యనారాయణ, జయకర్, రవి పాల్గొన్నారు.

పకడ్బందీగా గోసంరక్షణ

తిరుపతి రూరల్ : ఎస్వీ గోశాలలో నిర్మించిన ఎస్వీ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్, రెండో అగరబత్తీల కేంద్రాలను ఈ నెల 31న టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డిలు ప్రారంభించనున్నారు. ఈ మేరకు శనివారం ఏర్పాట్లను టీటీడీ జేఈఓ సదాభార్గవి, చీఫ్ ఇంజినీరు నాగేశ్వరరావు, ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ పద్మనాభరెడ్డి పరిశీలించారు. ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్‌ను ట్రయల్ రన్ చేశారు. టీటీడీ గోశాల డైరెక్టర్ డాక్టర్ హెరనాథరెడ్డి, వెటర్నరీ డీన్ పద్మనాభయ్య, రిజిస్ట్రార్ రవి పాల్గొన్నారు.

రుయాలో చిన్నపిల్లలకు అత్యాధునిక వైద్య సేవలు



పిల్లల తల్లులతో మాట్లాడుతున్న డాక్టర్ ఆనంద్

తిరుపతి తుడా: తిరుపతి రుయాలోని చిన్న పిల్లల ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సేవలు అందుతున్నాయని జాతీయ బాలల హక్కుల కమిషన్ సభ్యులు ఆర్‌జి.ఆనంద్ ప్రశంసించారు. ఆయన శనివారం చిన్న పిల్లల ఆస్పత్రిని తనిఖీ చేశారు. నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ వార్డులో పిల్లలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ కింద ఏర్పాటు చేసిన వార్డుల్లో పోషకాహార లోపమున్న, ఎదుగుదల లేని పిల్లలకు అందిస్తున్న చికిత్సను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల వైద్యానికి సంబంధించి అత్యాధునిక వైద్య పరికరాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమకూర్చడంపై అభినందించారు. ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారని వివరించారు. రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగ మునీంద్రుడు, ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి, సీఎస్ఆర్ఎంవో లక్ష్మానాయక్, డీపీఆర్‌వో బాల కొండయ్య పాల్గొన్నారు.


సర్వే అర్జీలకు సత్వర పరిష్కారం

తిరుపతి రూరల్: భూసర్వే కోసం వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా సర్వే, భూరికార్డుల అధికారి జయరాజ్ ఆదేశించారు. ఆయన శనివారం తిరుపతి రూరల్ మండలం తహసీల్దార్ కార్యాలయంలో సర్వే అర్జీలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుచానూరు, అవిలాల పంచాయతీల్లో ఎక్కువగా ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో 32 మంది సర్వేయర్లు ఉండగా వారిలో 26 మందిని వివిధ ప్రాంతాలకు డిప్యుటేషన్‌పై పంపించారని తిరుపతి డివిజన్ సర్వే అధికారి రాఘవయ్య తెలిపారు. ఉన్న సిబ్బందితోనే సమస్యలను త్వరగా పరిష్కరించాలని జయరాజ్ ఆదేశించారు. తిరుపతి రూరల్, అర్బన్ మండలాల సర్వేయర్లు కరుణకుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.

టిఫిన్ వ్యాన్‌కు నిప్పు

తిరుపతి రూరల్ : మండలంలోని పేరూరు పంచాయతీలో రోడ్డు పక్కన నిలిపివున్న టిఫిన్ మొబైల్ వ్యాన్‌కు గుర్తుతెలియని వ్యక్తులు శనివారం నిప్పుపెట్టారు. గరుడ అపార్టుమెంట్ ఎదురుగా హన్విక ఫాస్ట్‌ఫుడ్ పేరుతో టిఫిన్ అంగడి నిర్వహిస్తున్నారు. రోడ్డు పక్కన నిలిపివున్న ఈ వాహనానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.లక్ష ఆస్తినష్టం జరిగినట్టు బాధితులు నాగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

భూమన కుటుంబాన్ని విమర్శిస్తే తీవ్ర పరిణామాలు



మాట్లాడుతున్న ఆరే అజయ్‌కుమార్

తిరుపతి కల్చరల్: నిరంతరం ప్రజల సంక్షేమం కోసం శ్రమిస్తున్న ఎమ్మెల్యే భూమన కుటుంబాన్ని విమర్శించే అర్హత సినిమా టికెట్లు అమ్ముకునే జనసేన నేత కిరణ్ రాయల్‌కు లేదని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్, నేతలు బాలిశెట్టి కిషోర్, పసుపులేటి సురేష్ హెచ్చరించారు. వారు శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఏమి చేస్తారో చెప్పకుండా పవన్‌కల్యాణ్ కులాల పేరుతో చిచ్చు పెడుతున్నారని దుయ్యబట్టారు. అలాంటి పార్టీకి భజన చేసే కిరణ్‌రాయల్ ప్రజాదరణ పొందుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని, యువనేత భూమన అభినయ్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ నేతలు రాజశేఖర్, ఉదయ్ వంశీ, మద్దాలి శేఖర్, అనిల్‌రెడ్డి, ఆటోనగర వంశీ, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



చంద్రగిరి: ఏ.రంగంపేట పంచాయతీకృష్ణాపురానికి చెందిన సురేష్, శ్రీలక్ష్మి పెళ్లి నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను శనివారం డివిజన్ అధ్యక్షుడు భోస్‌రెడ్డి, సర్పంచ్ ఎర్రయ్య అందజేశారు. ఉప సర్పంచ్ మోనీష్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, రాంకుమార్ పాల్గొన్నారు.